క్లుప్తంగా

రాజన్న సన్నిధిలో 'బ్రహ్మచారి' చిత్ర యూనిట్



వేములవాడ: బ్రహ్మచారి చిత్రం డైరెక్టర్ నర్సింగరావు, హీరో గుంట మల్లేశంతోపాటు చిత్రం యూనిట్ సభ్యులు శుక్రవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. తమ చిత్రం విజయోత్సవాన్ని ఈ క్షేత్రం నుంచి తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు చేరుకుని నిర్వహిస్తామని వారు తెలిపారు. తమ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



దుస్తులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న 60 మంది క్రీడాకారులకు సామాజిక కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యుడు కొండ ఆంజనేయులుగౌడ్ సమకూర్చిన క్రీడా దుస్తులను శుక్రవారం ఆయన ఎల్లారెడ్డిపేటలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్, పీఈటీ ప్రభాకర్, ఉపాధ్యాయులు బాలయ్య, కొండ ఆంజనేయులుగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు పంపిణీ



ఇల్లంతకుంటలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. నర్సయ్య మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సాన బాబు, నర్ర శ్రీనివాస్ రెడ్డి, మామిడి శ్రీనివాస్, నిర్వాహకులు దాసరి శివరాం, ఒగ్గు మధు, కీసరి బాబు, యాస నిఖిల్, పైస మోజెస్, నవీన్, రుషి, విక్కీ, చిన్నారులు పాల్గొన్నారు.

శిక్షణ అధికారులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మారుమూల గ్రామాల్లోని సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతాయని శిక్షణ ఐఏఎస్ అధికారులు అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఐదు రోజుల పాటు శిక్షణను పూర్తి చేసుకొని శుక్రవారం వెళ్తుండగా వారిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఎన్నో అంశాలను నేర్చుకున్నామన్నారు. ఎంపీటీసీ గీతాంజలి, కార్యదర్శి సంతోష్, ఐకేపీ వీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హేమంత్‌కు సన్మానం

ముస్తాబాద్: పదో తరగతిలో పది జీపీఏ సాధించిన యువకుడిని గ్రామస్తులు గురువారం సత్కరించారు. మండలంలోని మోహినికుంటకు చెందిన బొల్లవేని మల్లేశ్, భాగ్య దంపతుల కుమారుడు హేమంత్ గంగాధర గురుకులంలో పదో తరగతి చదువుతూ పదిలో జీపీఏ సాధించాడు. శుక్రవారం హేమంత్‌ను ఘనంగా సన్మానించారు. రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, శ్రీనివాస్‌రావు, గోవర్ధన్‌రావు, మురళీ, దేవయ్య,దేవకిషన్, రాజం, భూమరాజు, శ్రీనివాస్, నర్సింలు, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల కూలి పెంచాలి

గంభీరావుపేట: బీడీ కార్మికుల వేతన ఒప్పందం ముగిసినందున ప్రస్తుత 40శాతం కూలి పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. ప్యాకర్లకు రూ. 6వేలు, నెలసరి ఉద్యోగులకు రూ.4వేల చొప్పున పెంచాలని బీడీ కంపెనీల యాజమాన్య సంఘం ప్రతినిధులకు బీడీ కార్మికుల సంఘం తరఫున వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. జీవనభృతి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, నెలలో 26 రోజుల పనికల్పించాలన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా

- శిథిలావస్థలో గ్రామ పంచాతీయలు
- ఏళ్లక్రితమే నిధులు మంజూరైనా పనులు చేపట్టని కాంట్రాక్టర్లు
- నిర్మాణాలు పూర్తిచేయాలని డిమాండ్



శిథిలావస్థలో ఆశిరెడ్డిపల్లె జీపీ భవనం

చందుర్తి: శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరై ఏడేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకుసాగడం లేదు. పాత అంచనా వ్యయాన్ని పెంచకపోవడంతో భవన నిర్మాణాలకు మోక్షం లభించడంలేదు. మండలంలోని సగానికి పైగా పంచాయతీ భవనాలన్నీ ఇరుకు గదులతో పెచ్చులూడుతూ కూలిపోయే దశలో ఉన్నాయి. ఉపాధిహామీ పథకంలో ఐదు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరుకాగా వాటిలో రెండింటిని మాత్రమే పూర్తిచేయగా, మిగిలిన మూడు గ్రామ పంచాయతీలు నిర్మాణానికి ఇంకా పనులు ప్రారంభించలేదు. అధికారులు, గత పాలకవర్గ సభ్యులు నిర్లక్ష్యంతో పనులు ముందుకుసాగడం లేదన్న ఆరోపణలున్నాయి.

మండలంలో 18 జీపీలు

మండలంలో గతంలో 18 గ్రామ పంచాయతీలుండగా , రుద్రంగి గ్రామాన్ని మండలంగా ప్రకటించారు. దీంతో 17 గ్రామపంచాయతీలు ఉండేవి. ఐదేళ్ల క్రితం రెండు నూతన పంచాయతీలను ఏర్పాటు చేశారు. దీంతో జీపీల సంఖ్య 19కి చేరుకుంది. ఇందులో ఇప్పటికే సనుగుల, మూడపల్లి, జోగాపూర్ గ్రామ పంచాయతీలను నూతనంగా నిర్మించారు. లింగంపేటలో భవనం నిర్మాణంలో ఉంది. దీంతో ఐదు గ్రామ పంచాయతీల్లో మినహా మిగతా గ్రామ పంచాయతీలన్నీ మూడు దశాబ్దాల క్రితమే నిర్మించినవి. తిమ్మాపూర్, నర్సింగాపూర్, మర్రిగడ్డ, ఎన్గల్, కట్టలింగంపేట, అనంతపల్లి, రామారావుపల్లె గ్రామాల్లోని గ్రామ పంచాయతీలు శిథిలావస్థలో ఉన్నాయి. దేవుని తండా పంచాయతీని స్వశక్తి మహిళా భవనంలో కొనసాగిస్తుండగా కొత్తపేట పంచాయతీని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

గ్రామపంచాయతీ భవనాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూంలు, టాయిలెట్స్, కనీస సౌకర్యాలు లేక పోవడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రెండునెలలకోసారి నిర్వహించే గ్రామసభలకు జీపీ కార్యాలయాల్లో స్థలంలేక ఆరు బయటే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మౌలిక వసతులతో నూతన జీపీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంచనా వ్యయం పెంచితే

ఉపాధిహామీ పథకంలో 2017లో మండలంలోని చందుర్తి, సనుగుల, మూడపల్లి, ఆశిరెడ్డిపల్లె, బండపల్లి గ్రామ పంచాయతీలకు రూ.13 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో సనుగుల, మూడపల్లి గ్రామ పంచాయతీల నిర్మాణం పూర్తిచేశారు. ఆశిరెడ్డిపల్లె, చందుర్తి, బండపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు స్థలం లేకపోవడంతో పాటు ఐదేళ్ల క్రితం ఎస్టిమేషన్‌తో పనులు చేయించలేమని అప్పటి సర్పంచులు నిరాకరించగా రూ.16లక్షలకు వ్యయం పెంచారు. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

అంచనా వ్యయం పెంచాలి



ఆరేళ్ల క్రితం అంచనా వ్యయంతో పనులు చేయాలంటే భవన నిర్మాణాన్ని చేపట్టడం వీలుకాదని అధికారులకు తెలిపాం. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం అంచనా వ్యయాన్ని పెంచితే నిర్మాణం చేపడుతాం.

– న్యాత విజయజార్జ్, మాజీసర్పంచ్, బండపల్లి

అధికారులు పట్టించుకోలేదు



పాత ధరలు, కొత్త ధరలకు వ్యత్యాసం చాలా ఉందని, కొత్త అంచనా ప్రకారం నిర్మాణ వ్యయాన్ని పెంచేలా అధికారులకు పలుసార్లు విన్నవించాం. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోలేదు.

– అంచ సుమ శ్రీహరిరెడ్డి, మాజీ సర్పంచ్, ఆశిరెడ్డిపల్లె.

ఎన్నికల కోడ్ ముగిశాకే



ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. శిథిలావస్థలో ఉన్న భవనాల నివేదికను గతంలో జిల్లా అధికారులకు అందించాం. కొత్త జీపీలకు నిధులు మంజూరయ్యాయి.

– బండి ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో, చందుర్తి

పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య



హరిదాస్‌నగర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న వీర బుచ్చయ్య

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటిక, కంపోస్టు షెడ్లు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదు ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు, చెత్త తొలగించే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీర బుచ్చయ్య మాట్లాడుతూ..మరో నాలుగు రోజుల్లో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలోఎంపీవో వజీర్, కార్యదర్శి సంపత్‌రెడ్డి, కారొబార్ పంతంగి మహేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ పులి రాజు తదితరులున్నారు.

లావణి పట్టా భూమి సాగుపై విచారణ



చందుర్తి: మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన 216 సర్వే నెంబర్‌లో కమటం లక్ష్మీరాజం, తిరుపతి సాగు చేసుకుంటున్న లావణి పట్టా భూమి సాగుపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చి హద్దులు చూపకపోవడంతో పట్టాదారులు ఆ ప్రాంతాన్ని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. కాగా పట్టాలిచ్చిన ప్రాంతంలోని ప్రభుత్వ భూమి మట్టిని తరలిస్తున్నారని నలుగురు వ్యక్తుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. కాగా భూమి సాగుపై విచారణ చేపట్టిన ఆర్ఐ శ్రీనివాస్ వివరాలను తహసీల్దార్ శ్రీనివాస్‌కు వివరించారు. రాత్రిపూట ప్రభుత్వ భూమిని నుంచి మట్టిని తరలించకుండా పెట్రోలింగ్ చేపట్టాలని ఎస్సై శ్రీకాంత్‌ను కోరినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.



ఘనంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం..

బోయినపల్లి: మండలంలోని తడగొండలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. ఆలయ ప్రాంగణం నుంచి గ్రామపంచాయితీ కార్యాలయ సమీపం వరకు రథం ఊరేగింపు సాగింది. స్వామివారి రథం లాగేందుకు యవకులు, మహిళలు, పోటీపడ్డారు. రథోత్సవం అనంతరం శ్రీనివాస దీక్షాస్వాములు భజనలతో భక్తులను అలరించారు. పూజారులు చక్రపాణి ఆచార్య, అనిల్ ఆచార్య, హరికృష్ణ ఆచార్య, సాయిశర్మ పూర్ణాహుతి హోమం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థికసాయం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన రైతు రుద్రారపు చంద్రయ్య ఇటీవల పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, ట్రాక్టర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్ పరామర్శించారు. అనంతరం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ పిట్ల నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకులు బండి జగన్, శ్రీకాంత్ రెడ్డి, పూర్ణచందర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేకలు దొంగతనం

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లెకి చెందిన బత్తుల ఆంజనేయులుకు చెందిన మేకల మందలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మేకలను ఎత్తుకెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి మేకలు అరవడంతో బయటకు వచ్చిచూడగా మేకలు ఎత్తుకెళ్తున్న వ్యక్తులను చూసి కేకలు వేశారు.దీంతో ఒక మేకను వదిలి మరో మేకను ఎత్తుకొని వెళ్లారని వాపోయాడు. వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రేపు బండ్ల బోనాల పండుగ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఏటా నిర్వహిస్తున్న బండ్ల బోనాల పండుగ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో బండ్ల బోనాల పండుగ కోసం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గ్రామంలోని వివిధ కులసంఘాల సభ్యులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ మేరకు పండుగను ఆదివారం సాయంత్రం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో నాయకులు బాల్‌రాజ్ యాదవ్, పారిపల్లి రాంరెడ్డి, మేగి నర్సయ్య, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్, జితేందర్, వెంకటేశ్‌గౌడ్, పద్మారెడ్డి, లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాల్లో 316 మందికి 287 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో మోహన్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



వేములవాడ : ప్రమాదంలో గాయపడిన మారుపాక గ్రామానికి చెందిన అవధూత గంగయ్య ప్రమాదంలో గాయపడగా చికిత్స కోసం మన చారిటబుల్ ట్రస్ట్ శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు మోటూరి మధు, రాము, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ..

వేములవాడ పట్టణంలోని బాలానగర్‌కు చెందిన దుర్శెట్టి కొండయ్య ఇటీవల దుబాయిలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. '98' ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల నగదు, 25 కిలోల బియ్యం శుక్రవారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు బాయి సుమన్‌శర్మ, గంప నరేశ్, సాయిలు, కౌన్సిలర్ తిరుమల్‌రెడ్డి కవితా సుమంత్‌రెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రంలో మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ కోరారు. సిరిసిల్లలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. సెకండ్ ఫేస్ పీజీటీలకు నోషనల్ సర్వీస్ కల్పించడం ద్వారా వేతన వ్యత్యాసం పూరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పులి రాం గోపాల్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల బొప్పాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. చివరిగా తూకం వేసిన ధాన్యం లారీ లోడ్‌ను శుక్రవారం రైతులు, నిర్వాహకులు రైస్ మిల్లులకు తరలించారు. రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొంగరి కిష్టారెడ్డి అన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని అధ్యాపకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. మండలంలోని కోరుట్లపేట, రాచర్లబొప్పాపూర్, రాగట్లపల్లి గ్రామాల్లో శుక్రవారం అధ్యాపకులు ఇంటింటా తమ పిల్లలను సర్కార్ కళాశాలలో చేర్పించాలని కోరారు. 25 మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు పొందుతామని అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు. అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

చందుర్తి: మండలకేంద్రంలోని శివారులో బైక్ అదుపుతప్పి శుక్రవారం రాత్రి బైక్ అదుపు ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. భీమారం మండలం గోవిందారంకు చెందిన పోతురాజు రాములు (50) చందుర్తికి వస్తుండగా దుర్గమ్మ ఆలయ సమీపంలో బైక్ అదుపు కిందపడిపోయాడు. రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం 108లో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే 'ఆది'పై ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడరూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్ హితవు పలికారు. మండలంలోని ఎదురుగట్లలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు. మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గల్ఫ్ కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారన్నారు. దానిలో భాగంగానే దుబాయి పర్యటనలో ఉన్నారని, కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించడం సరికాదన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి జర్మనీలో ఉన్న సందర్భాలున్నాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వ పాలనలో లక్షా 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల 24 వేల పైచిలుకు ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 70 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. బీఆర్‌ఎస్ ఉనికిని చాటుకునేందుకు ఇలాంటి విమర్శలు చేస్తుందన్నారు. ఇకపై ముందు విమర్శలు చేస్తే గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులను ప్రజలు తిరగనివ్వరని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులన్నీ కూలిపోయాయన్నారు. సమావేశంలో నాయకులు బొడ్డు రాములు, గోవర్ధన్‌రెడ్డి, వంగపల్లి మల్లేశం, రొండి రాజు, బండ శ్రీనివాస్, చిలుక ప్రభాకర్, తీగల ఎల్లగౌడ్, అడ్డిక శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి, నర్సయ్య, పాలకుర్తి పర్శరాములు, అనిల్, జైపాల్‌రెడ్డి, రోమాల ప్రవీణ్, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్



మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్



మాట్లాడుతున్న చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు

బోయినపల్లి: నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం మండలస్థాయి విత్తన డీలర్లతో ఏవో ప్రణీత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ డీలర్లు షాపులో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వినియోగదారులకు బిల్లులు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్, ఎంఏవో ప్రణీతారెడ్డి, ఏఈవోలు శ్రీదేవి, అనూష, రవళి, విత్తన డీలర్లు , తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

కోనరావుపేట: ఖరీఫ్ వరిసాగుకు నకిలీ విత్తనాలను అరికట్టాలని చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఫెర్టిలైజర్ దుకాణాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడైనా ఇలాంటి విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులు ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేస్తే బిల్లు తీసుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణాల్లో ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. ఎస్సై ఆంజనేయులు, వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ, ఏఈవోలు రమేశ్, సహజ, హేమాజీ, అన్ని గ్రామాల దుకాణ దారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో పట్టభద్రులు



అడవిపదిరలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- మండలంలో 17 గ్రామాలు
- రోజూ 2,600 మంది ఉపాధిహామీ పనులకు..
- వందమందికి పైగా ఉన్నత విద్యావంతులు

వీర్నపల్లి: వారంతా ఉన్నత చదువులు చదివిన వారే. అయినా తట్ట, పార పట్టుకొని పనిబాట పడుతున్నారు. ఉపాధికోసం ఈజీఎస్ పనులకు వెళ్తున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. సుమారు వందమందికి పైగా డిగ్రీ, పీజీ చదివిన యువతే ఉపాధి పనులకు వెళ్తున్నారు.

మండలంలో 17 గ్రామాలు

మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఆయాగ్రామాల పరిధిలోని 3,654 కుటుంబాలకుగాను 6,916 మందికి జాబ్‌కార్డులున్నాయి. అందులో 2,951 యాక్టివ్ జాబ్ కార్డులుండగా ప్రతిరోజూ 2,600 మంది పనులకు హాజరవుతున్నారు. సుమారు వందమందికి పైగా డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ చదివిన వారు పనికి వెళ్తూ కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు. ప్రతి పంచాయతీలో 200 మంది వరకు పనికి వెళ్తుండగా అందులో పది శాతానికి పైగా యువతే ఉన్నారు. ఉదయం7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు పూర్తిచేసి ఇంటికి చేరుకుంటున్నారు.



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు సుతారి రాజమల్లేశం. అడవిపదిర గ్రామానికి చెందిన ఈయన 2008లో బీఈడీ పూర్తిచేసి 2009, 2012లో డీఎస్సీ రాశాడు. కానీ ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్దనే వ్యవసాయం చేసుకుంటూ ఉపాధిహామీ పనికి వెళ్తున్నాడు. రాజమల్లేశమే కాదు. బీఎడ్, ఇతర చదువులు చదివినవారు మండలంలో చాలామంది ఉన్నారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ప్రతి సంవత్సరం వేయాలని కోరుతున్నాడు.



ఈ ఫొటోలో ఉన్న యువతి పేరు అజ్మీర స్వాతిక. మండలంలోని గర్జనపల్లి గిరిజన తండాకు చెందిన ఈ యువతి బీటెక్ పూర్తిచేసి, ప్రస్తుతం ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. ఏటా వేసవిలో కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఉపాధి హామీకి పనులకు వెళ్తోంది. చిన్న చిన్న అవసరాలు ఉపాధి కూలీ డబ్బులతో వెళ్లదీయొచ్చని తెలుపుతోంది. మున్ముందు ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే లక్ష్యమని అజ్మీర స్వాతిక చెబుతోంది.